సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 14 । జనవరి । 2025



మన బాహుబలి - 8లో

మల్లమార్తాండగా ప్రపంచ దేశాలలో భారత దేశ కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పిన బాహుబలి మన కోడి రామ్మూర్తినాయుడు.



మహారాణి పైడితల్లి

ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారు వనంగుడిలో భోగి సందర్భంగా మహారాణి అలంకరణలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. - 8లో

ఆ గ్రామాల్లో రెండు రోజుల సంక్రాంతి..



డెంకాడ మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండగను రెండు రోజులు నిర్వహిస్తారు. - 8లో

న్యూస్‌రీల్

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం



భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సాలూరు: ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక బిల్లుల భారం మోపడంపై సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సాలూరు పట్టణంలోని మెయిన్‌రోడ్డు, నెయ్యిలవీధి, గాంధీనగర్, బంగారమ్మకాలనీ, తదితర వీధుల్లో సోమవారం వేసిన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.6072 కోట్ల బిల్లుల భారం వేసిందన్నారు. మరో రూ.11,820 కోట్లు భారం వేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రాముడు, వెంకటరావు, రవి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం



రామకోనేరు వద్ద గోదాదేవికి మంగళస్నానం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో సోమవారం గోదాదేవి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ధనుర్మాస వ్రత ముగింపు రోజున ఏటా గోదాదేవి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా వేకువజామున 4 గంటలకు స్వామివారికి ప్రాతఃకాలార్చన నిర్వహించి ధనుర్మాస ఉత్సవాన్ని జరిపించారు. ముందుగా గోదా అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ పల్లకిలో ఊరేగించారు. అనంతరం రామకోనేరు వద్ద అమ్మవారి విగ్రహానికి నలుగుపూసి మంగళస్నానం చేయించారు. గోదాదేవిని పెళ్లి కుమార్తెలా అలంకరించి దేవాలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. రామ సన్నిధిలో ప్రత్యేక పూజలు అనంతరం గోదాదేవికి శ్రీకృష్ణపరమాత్ముడితో కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఈఓ వై.శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, గొడవర్తి నరసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలమాంబ అరుదెంచిన వేళ..



అమ్మవారి ఘటాలను తీసుకొస్తున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పోలమాంబ అరుదెంచిన వేళ భక్తలోకం పులకించింది. శంబర గ్రామం భక్తులతో పోటెత్తింది. అమ్మకు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికింది. మంగళవాయిద్యాలు, తప్పెటగుళ్లు, కోలాట ప్రదర్శనల నడుమ గ్రామానికి ఆహ్వానించింది. దారిపొడవునా అమ్మవారి ఘటాలకు పూజలు చేసింది. సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో గోముఖి నదిఒడ్డున పూజారి కుటుంబీకులు, రెవిన్నాయుడు, పూడి, కుప్పిలి వారి కుటుంబీకులు, ఆశాదీలు, దేవదాయశాఖ సిబ్బంది అమ్మవారి ఘటాలకు పూజలు చేశారు. అమ్మవారి ఘటాలకు భక్తులు ఎదురెళ్లి పసుపు, కుంకుమలు సమర్పించారు. రాత్రి 10.30 గంటల సమయంలో అమ్మవారిని చదురుగుడికి చేర్చారు. మంగళవారం విశ్రాంతి తీసుకొని, బుధవారం నుంచి అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు. గ్రామంలోని చదురుగుడిలో 13 రోజులపాటు ఉదయం వేళలో భక్తులకు దర్శనమిస్తూ, సాయంత్రం వేళ గ్రామంలోని అన్ని పురవీధులలో తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ నెల 27న తొల్లేళ్ల ఉత్సవం, 28న సిరిమానోత్సవం, 29న అనుపోత్సవం నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఈఓ వి.వి.సూర్యనారాయణ, మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్లు, గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారికి కోలాట ప్రదర్శనతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

సంక్రాంతికి వచ్చేశాం.. గుంతలు ఎదురొచ్చాయ్!

ఉచిత హామీలతో నమ్మించడం... ఎన్నికల్లో గట్టెక్కాక మోసం చేయడం, చేసినది అంతంత మాత్రమే అయినా.. అంతా చేసేశాం అంటూ అబద్ధాలను ప్రచారం చేయడం చంద్రబాబుకు అలవాటైన విద్య. ప్రజలను బురిడీ కొట్టించడంలో ఆయనకు ఎవరూ సాటిరారన్నది రాజకీయ విశ్లేషకుల మాట. ఇప్పుడు సంక్రాంతికి పల్లెలకు వచ్చేవారికి చక్కటి రోడ్లతో స్వాగతం పలుకుతామంటూ వివిధ సమావేశాల్లో చెప్పారు. కొన్ని పనులను పార్టీ నేతలకే అప్పగించారు. ఆ పనులు నాసిరకంగా చేయడంతో మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. మరి కొన్ని ప్రారంభించకపోవడంతో సంక్రాంతికి వచ్చాం.. గుంతలే ఎదురొచ్చాయంటూ నిట్టూర్చుతున్నారు. చంద్రబాబు ఏ మాట చెప్పినా నమ్మబుద్ధికాదని, సూపర్ సిక్స్ అంటూ నమ్మించి నట్టేటముంచారని, ఇప్పుడు గుంతలు లేని రోడ్లు అంటూ అభివృద్ధి పనుల్లోనూ ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని, నాసిరకం పనులతో ప్రజాధనాన్ని పార్టీ నాయకులకు కట్టబెడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు/పాలకొండ/పార్వతీపురం టౌన్



పండగకు ఊరొస్తున్న వారికి గోతులతో స్వాగతం పలుకుతున్న బెలగాం రైల్వేస్టేషన్ మార్గం

ఈ చిత్రం చూశారా... సాలూరు మండలం సన్యాసిరాజుపేట సమీపంలో రహదారి మధ్యలో ఏర్పడిన పెద్ద గొయ్యి ఇది.. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా రాత్రి వేళ ప్రయాణం ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానికులు హెచ్చరికగా గొయ్యి మధ్యలో ఇలా కర్రలు ఏర్పాటు చేశారు. ఏడు నెలల పాలనా కాలంలో ఈ గొయ్యి పూడ్చడానికి కూటమి పాలకులకు తీరిక కుదరలేదు మరీ..!



- పండగకు వచ్చే వారికి గుంతలు లేని రోడ్లు స్వాగతం పలుకుతాయన్న కూటమి నాయకులు
- రెండు నెలలుగా అరకొర గోతులు పూడ్చే పనులే..
- అవి కూడా నాసిరకం
- కొద్ది రోజులకే మళ్లీ యథాస్థితికి..
- రూ.కోట్ల ప్రజాధనం బుగ్గిపాలు
- రోడ్ల కష్టాలు యథాతథం

సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వచ్చే వారికి గుంతలు లేని రహదారులు స్వాగతం పలుకుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. కొద్ది రోజులుగా అవకాశం దొరికినప్పుడల్లా చెబుతూ వస్తున్నారు. ఆ సంక్రాంతి పండగ రానే వచ్చింది. ఎక్కడెక్కడ నుంచో సొంతూర్లకు వస్తున్న జిల్లా వాసులకు మాత్రం గుంతలు పడిన రహదారులే ఎదురొచ్చాయి. రహదారుల మరమ్మతులకు రూ.కోట్లాది నిధులు వెచ్చించామని చెబుతున్న కూటమి ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలు నాసిరకం పనులతో మమ అనిపించగా.. మరికొన్ని చోట్ల, గత ప్రభుత్వం వేసిన అద్దంలాంటి రోడ్లను సైతం తవ్వించి.. పైపై మెరుగులు పూసి, మాయ చేశారు. తాము ఇస్తున్న హామీలను అమలు చేయలేక.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం చిమ్మడమే లక్ష్యంగా మాటల దాడికి దిగుతున్నారు.

నాడు మారుమూల గ్రామాలకూ రహదారులు..

వాస్తవానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగు నియోజక వర్గాల పరిధిలో మునుపెన్నడూ లేని అభివృద్ధి కనిపించింది. కోట్లాది రూపాయలను వెచ్చించి రహదారులను నిర్మించారు. కొండ కోనల్లోని గిరిజన ప్రాంతాలకు సైతం అద్దం లాంటి తారు రోడ్లు వచ్చాయి. కాలక్రమంలో భారీ వాహనాల రాకపోకలు, వర్షాల వల్ల ఎక్కడ రహదారులు అయినా కాస్త దెబ్బతినడం సహజం. అది ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జరుగుతుంది. దీన్నే భూతద్దంలో చూపుతూ.. అసలు రహదారులే వేయలేనట్లు కూటమి ప్రభుత్వం విషం చిమ్మడం మొదలు పెట్టింది. పోనీ, అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలో సాధించింది ఏమైనా ఉందా అంటే అదీ లేదు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన, పూర్తి అయిన రోడ్లను తమ గొప్పగా చెప్పుకోవడం. అన్నిటికీ మించి రహదారుల మరమ్మతులకు అంటూ కోట్లాది నిధులు ఖర్చు చేసి, నాసిరకం పనులు చేపట్టి, పెద్ద ఎత్తున స్వాహా పర్వానికి తెర తీశారన్న ఆరోపణలు వస్తున్నాయి.

మంత్రి గారి మాట :

'ఎక్కడైనా రోడ్లపై గుంతలు చూశాం గానీ.. గత ప్రభుత్వంలో గుంతల్లో రోడ్లు ఉండేవి...' ఇదీ ఇటీవల రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గత ప్రభుత్వంపై చేసిన విమర్శలు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతోంది. సాలూరు నియోజకవర్గంలో 100 సీసీ రోడ్లలో మొత్తం రూ.5 కోట్ల వ్యయంతో మక్కువ మండలంలో 35, సాలూరులో 22, పాచిపెంటలో 27, మెంటాడ మండలంలో 20 నాణ్యమైన సీసీ రోడ్లు పూర్తి చేసుకున్నామని ఆమె చెబుతున్నారు. పాచిపెంట మండలంలో బీటీ రోడ్లు నిమిత్తం రూ.3 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పుకొచ్చారు.



పీఎన్ బొడ్డవలస సమీపంలో గోతులమయమైన రహదారి)

జరుగుతున్నదేమిటి..:

సాలూరు పట్టణం నుంచి మండలంలోని గంగన్నదొరవలస వరకూ రహదారి మరమ్మతు పనులకు రూ.40 లక్షలు ఆర్అండ్‌బీ నిధులు మంజూరు చేశారు. పనులు కూడా ప్రారంభించారు. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గ పర్యటనకు వస్తున్నారని హడావిడిగా కొంత గోతులు పూడ్చారు. కొద్ది రోజులకే రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. పీఎన్ బొడ్డవలస సమీపంలో రహదారిపై ఏర్పడిన గోతులను ఇక్కడి చిత్రంలో చూడొచ్చు. దీన్నిబట్టి పనులు ఎంత 'నాణ్యంగా' జరిగాయో అర్థం చేసుకోవచ్చు.

ఇన్‌చార్జి మంత్రి గారి మాట:

'రూ.850 కోట్ల వ్యయంతో గుంతలు లేని రహదారుల నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. ఈ పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.' ఇటీవల జరిగిన డీఆర్సీ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పిన మాటలు ఇవీ...



జిల్లా కేంద్రానికి వచ్చే ఆంధ్రా-ఒడిశా అంతర్రాష్ట్ర రహదారి దుస్థితి

వాస్తవమిదీ.. :

ఆంధ్ర- ఒడిశా అంతరాష్ట్ర రహదారి ఇది.. జిల్లా కేంద్రానికి వస్తున్న ప్రధాన మార్గం. పెద్ద పెద్ద గోతులతో పార్వతీపురం పట్టణంలోకి వచ్చే వారికి సాదర స్వాగతం పలుకుతోంది. పట్టణానికి నలువైపులా ఇదే పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రంలోని పరిస్థితే ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో కూటమి ప్రభుత్వ హామీ ఏ మేరకు నెరవేరిందో పాలకులకే తెలియాలి. పార్వతీపురం నియోజకవర్గంలోని సీతానగరం మండలం ఏగోటివలస-దయానిధిపురం వయా గాదెలవలస గ్రామాల రోడ్లు రాళ్లు తేలాయి. చినభోగిలి నుంచి బగ్గందొరవలస మార్గం బీటీ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతంతో అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బలిజిపేట మండలం భైరిపురం నుంచి అంపావిల్లి వెళ్లే రహదారి గుమ్ములు, గోతులతో ప్రమాదకరంగా ఉంది. కనీసం ఇక్కడ మరమ్మతు పనులు కూడా చేపట్టలేదు.

పాలకొండ నియోజకవర్గ పరిధిలోనిది ఈ దృశ్యం. శ్రీకాకుళం రహదారిలో గాయత్రి ఆలయం మీదుగా.. వీరఘట్టం మార్గంలో నవగాం వరకు ఆర్ అండ్ బీ ద్వారా రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. రోజులు గడవక ముందే ఈ పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. రహదారిపై వేసిన తారు మాయమై రాళ్లు తేలాయి. పాలకొండ, వీరఘట్టం, విశాఖ రహదారులు కలిపే స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద రహదారి అధ్వానంగా మారింది. రూ.25 లక్షలు బుగ్గిపాలు అయ్యాయి. ఒక్క పాలకొండ నియోజకవర్గంలోనే పంచాయతీరాజ్ ద్వారా 22 రహదారి పనులకు నిర్ణయించారు. దాదాపు నాలుగు మండలాల పరిధిలో 34.52కిలోమీటర్ల బీటీ, సీసీ రహదారుల పనులకు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి రూ.3315.70 లక్షలు అంచనా వ్యయం నిర్ణయించారు. ప్రస్తుతం గ్రామాల్లో ఈ పనులు మందకొడిగా కొనసాగుతుండగా.. వేసిన చోట కూడా నాణ్యతాలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.



- మన్యం జిల్లాకు సంబంధించి ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమం కింద తొలివిడతలో 46 పనులు మంజూరయ్యాయి. 21.350 కిలోమీటర్ల మేర పనులు చేపట్టేందుకు రూ.12.50 కోట్లు వెచ్చించారు. రెండో విడత 49 పనులకు గానూ రూ.18 కోట్లు కేటాయించగా.. రూ.213.74 మేర రహదారులకు మరమ్మతులకు సిద్ధమయ్యారు.
- పల్లె పండగ కార్యక్రమం కింద పెద్ద ఎత్తున రహదారుల పనులు చేపడుతున్నట్లు చెబుతున్నారు. రూ.289 కోట్ల అంచనా వ్యయంతో 458 పనులు మంజూరు చేశారు. రూ.32 కోట్ల వ్యయంతో 195 సీసీ రహదారులు, రూ.24 కోట్లతో 204 బీటీ రహదారులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు పలు పనులకు గానూ రూ.126 కోట్లు వెచ్చించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నూతనంగా నియమించిన అనుబంధ విభాగాల అధ్యక్షులు

విభాగం	అధ్యక్షుల పేరు	నియోజకవర్గం
యవజన విభాగం	నంగిరెడ్డి శరత్ బాబు	కురుపాం
మహిళా విభాగం	రెడ్డి పద్మావతి	సాలూరు
రైతు విభాగం	తాడ్డి యశోధా కృష్ణ	సాలూరు
బీసీ సెల్	మరొశర్ల బాపూజీ నాయుడు	కురుపాం
ఎస్టీ సెల్	హిమరిక మోహన్‌రావు	పాలకొండ
క్రిస్టియన్ మైనారిటీ విభాగం	మర్రపు శ్రీనివాసరావు	పార్వతీపురం
విద్యార్థి విభాగం	బోతాడ గౌరాశంకర్రావు	కురుపాం
పంచాయతీరాజ్ విభాగం	గొట్టాపు ప్రదీప్ నాయుడు	సాలూరు
మున్సిపల్ విభాగం	పాత గౌరీశంకర్రావు	పార్వతీపురం
ఆర్టీఐ విభాగం	గొడ్డు జయరాజు	సాలూరు
వలంటీర్ల విభాగం	తొలుగు రాజశేఖర్	కురుపాం
గ్రీవెన్స్ సెల్	సెట్టి నాగేశ్వరరావు	కురుపాం
వాణిజ్య విభాగం	కెంగువ ఆంజనేయులు	పాలకొండ
వీవర్స్ విభాగం	ఆశపు సర్వేశ్వరరావు	పార్వతీపురం
వైఎస్సార్‌టీయూసీ	పి.వి.రమణ	పార్వతీపురం
అంగన్‌వాడీ విభాగం	దుప్పాడ కళావతమ్మ	పాలకొండ
లీగల్ సెల్	కోట బాపూజీ	కురుపాం
కల్చరల్ విభాగం	సవర చంద్రశుఖర్	పాలకొండ
సోషల్ మీడియా విభాగం	ఇల్లా శ్రావణ్ కుమార్	పాలకొండ
ఐటీ విభాగం	పూడి కృష్ణ చైతన్య	సాలూరు
దివ్యాంగుల విభాగం	ముల్లు ప్రసాద్	పాలకొండ
పబ్లిసిటీ విభాగం	గిరి రఘు	సాలూరు
ఇంటెలెక్చువల్ ఫాం	పోరాన శ్రీరామచంద్ర నాయుడు	పార్వతీపురం
బూత్ కమిటీ విభాగం	లోలుగు నారాయణరావు	కురుపాం

సేవల్లో మా'స్టార్'

(ఊరికి ఉపకారి)

- ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఊరి ప్రజలకు సేవ
- విద్య, వైద్యం, ధార్మిక కార్యక్రమాల్లో 'గురువు'పాత్ర
- పాఠశాలలో రూ.3లక్షల ఖర్చుతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

మక్కువ:

ఆయన చేస్తున్నది ఉపాధ్యాయ ఉద్యోగం. ప్రవృత్తిగా సేవామార్గాన్ని ఎంచుకున్నారు. ఓ వైపు విద్యార్థుల్లో అక్షర వెలుగులు నింపుతూనే మరో వైపు పుట్టిపెరిగిన ఊరికి, గ్రామ ప్రజలకు సేవలందిస్తున్నారు. విద్య, వైద్య, ఆర్థిక, ధార్మిక సేవలతో అండగా నిలుస్తున్నారు. ఆయనే.. మక్కువ మండలం వెంకటభైరిపురం గ్రామానికి చెందిన మరడ శ్రీనివాసరావు. గ్రామంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్‌ను స్థాపించి గ్రామ ప్రజలకు ఏకష్టమొచ్చినా, ఏ అవసరమొచ్చినా నేనున్నాంటూ భరోసా కల్పిస్తున్నారు. ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సేవలను ఓ సారి తరచిచూస్తే..

- గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది ఆగస్టు 30వ తేదీన సుమారు 25వేల రూపాయిలు వెచ్చించి, విద్యార్థుల సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఫౌండేషన్ తరఫున ఏర్పాటుచేశారు. తాజాగా గ్రామ ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలనే ఉద్దేశంతో సుమారు రూ.3లక్షల సొంత డబ్బులతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం సర్పంచ్ మరడ వెంకటరత్నం చేతుల మీదుగా ప్రారంభించారు.



వెంకటభైరిపురంలో మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

- గ్రామంలో నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయం, శివాలయం నిర్మాణాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఐదేళ్లుగా గ్రామానికి చెందిన ప్రతీ ఆడపిల్లకు పెళ్లి కానుకగా రూ.10వేల నగదు, చీర, సారెను అందజేస్తున్నారు. తల్లిదండ్రులు లేని ఆడపిల్లలను అక్కున చేర్చుకుని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామంలో ఉచిత వైద్యంతోపాటు మందులు అందజేస్తున్నారు.
- గ్రామంలో చదువుకున్న యువతీ, యువకులు పోటీపరీక్షల్లో విజేతలుగా నిలిచేందుకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతూ గ్రామంలో ప్రత్యేక గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తూ చదువులో ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక సహాయం చేస్తున్నారు.
- పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలల మైదానాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంరక్షిస్తున్నారు. సంక్రాంతి, ఉగాది, దసరా, క్రిస్మస్ పండగలకు పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు, గ్రామంలో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే, వారికి ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు, రక్తదానం, ఉచితంగా మందులు, వైద్యఖర్చులు భరించి ఊరికి ఉపకారిగా నిలుస్తున్నారు.



రక్తదానం చేస్తున్న శ్రీనివాసరావు (ఫైల్)

భోగి వైభోగం



తోటపల్లిలో గోదాదేవి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకుడు

ఊరూ.. వాడ సోమవారం వేకువజామునే మేల్కొంది. భోగిమంట వద్దకు చేరుకుని సందడిగా గడిపింది. ఓ వైపు జంగం దేవరలతో పెద్దలకు పొగిడింపులు, మరోవైపు చిన్నారులకు భోగిపళ్లతో పెద్దల ఆశీర్వచనాలు.. హరిదాసుల హరినామ కీర్తనలు.. కమనీయంగా సాగిన గోదారంగనాథుల కల్యాణోత్సవాలు, దాతల వస్త్రదానాలు, మహిళలకు రంగవల్లుల పోటీలతో పల్లెలు మురిసిపోయాయి. భోగి పండగను కోలాట ప్రదర్శనల నడుమ వేడుకగా జరుపుకున్నాయి. పెద్ద పండగకు స్వాగతం పలికాయి.

- గరుగుబిల్లి/వీరఘట్టం/పార్వతీపురం టౌన్



వీరఘట్టం: భోగి మంట వద్ద బర్నాల వీధి వాసులు



భోగి పళ్లతో చిన్నారికి ఆశీర్వాదం

క్లుప్తంగా

20 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు


శ్యామ్ ప్రసాద్, కలెక్టర్

పార్వతీపురం: కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగిరంగు మచ్చలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరములు, కాళ్లు, చేతుల కండరాల్లో బలహీనత ఉన్నా, తిమ్మిర్లు లక్షణాలున్నా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే ఆరు నెలల్లో పూర్తిగా నయం చేయవచ్చన్నారు. సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు సైతం వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

బీఆర్ఏయూ క్రికెట్ జట్టుకు జీసీఎస్ఆర్ విద్యార్థులు


బీఆర్ఏయూ క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

రాజాం సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ జట్టుకు స్థానిక జీసీఎస్ఆర్ విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ చీకటి కేశవనారాయణ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న శివాని ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో కళాశాలకు చెందిన కె.రాజేష్‌కుమార్, కె.సాయిభాస్కర్ చక్కని ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 16 నుంచి 25 వరకు చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరగనున్న పోటీల్లో బీఆర్ఏయూ జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తమ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.రవీంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో- బైక్ ఢీ

● నలుగురికి గాయాలు

గంట్యాడ: ఆటో, బైక్ ఢీ కొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. సోమవారం జరిగిన ప్రమాద వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన ఆర్.వాసు బైక్‌పై విజయనగరం వెళ్తున్నాడు. సరిగ్గా కరకవలస పెట్రోల్ బంక్ దగ్గరకు వచ్చేసరికి విజయనగరం నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో వాసు కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అలాగే ఆటోలో ఉన్న పెదవేమలి గ్రామానికి చెందిన కొయ్యాన రమణకు చేయి విరిగిపోగా, మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడు రమణ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీ కొనడంతో ఒకరికి..


గజపతినగరం : ప్రమాదానికి కారణమైన కారు

గజపతినగరం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పాలదారి చెరువు వద్ద కారు ఢీ కొన్న సంఘటనలో ద్విచక్రవాహనదారుడు గాయాలపాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. దత్తిరాజేరు మండలం గదబవలస గ్రామానికిచెందిన నెలివాడ లోకేష్ అనే వ్యక్తి తన స్వగ్రామం నుంచి స్కూటీపై గజపతినగరం వస్తుండగా.. గజపతినగరం నుంచి మానాపురం వైపు వెళ్తున్న కారు అతడ్ని ఢీ కొట్టింది. దీంతో లోకేష్‌కు తీవ్రగాయాలు కావడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. ఏఎస్సై శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేర నియంత్రణకు డ్రోన్స్‌తో పర్యవేక్షణ

● వన్‌టౌన్ సీఐ ఎస్. శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని నేరాల నియంత్రణకు డ్రోన్స్‌తో పర్యవేక్షిస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్. శ్రీనివాస్ అన్నారు. ఎస్పీ వకుల్‌జిందల్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రద్దీ ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసేందుకు, నేరాలను నియంత్రించేందుకు డ్రోన్స్ వినియోగిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టేందుకే డ్రోన్స్ ఉపయోగపడతాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యక్రమాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో ఎస్సైలు నరేష్, సురేంద్రనాయుడు, ప్రసన్నకుమార్, తదితరులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.

మన బాహుబలి

- కలియుగ భీముడిగా పేరుగాంచిన కోడి రామ్మూర్తినాయుడు
- ప్రపంచ దేశాల్లో భారతదేశ ఖ్యాతిని చాటిచెప్పిన మల్ల యోధుడు
- నేడు రామ్మూర్తినాయుడు వర్ధంతి



కోడి రామ్మూర్తి నాయుడు చిత్రపటం

కోడి రామ్మూర్తినాయుడు బల ప్రదర్శన ఊహాచిత్రం

వీరఘట్టం తెలగవీధి వద్ద ఏర్పాటు చేసిన కోడి రామ్మూర్తినాయుడి విగ్రహం

వీరఘట్టం: ఇండియన్ హెర్క్యులస్... కలియుగ భీముడు.. మల్లమార్తాండగా ప్రపంచ దేశాలలో భారతదేశ కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పిన బాహుబలి మన కోడి రామ్మూర్తినాయుడు. ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం ఈయన స్వస్థలం. స్థానిక తెలగవీధికి చెందిన కోడి వెంకన్న నాయుడు, అప్పలకొండ దంపతులకు 1883 నవంబర్ 3న రామ్మూర్తినాయుడు జన్మించారు. హీరోలు ఒంటి చేత్తో కారును ఆపడం.. రెండు తాళ్లు కట్టి కారులను లాగడం.. బండరాళ్లను ఛాతీపై పెట్టి సమ్మెటలతో కొట్టించుకోవడం.. వంటి విన్యాసాలను మనం సినిమాల్లో చూస్తుంటాం. కాని ఇటువంటి ప్రదర్శనలెన్నో మన కోడి రామ్మూర్తినాయుడు ఎప్పుడో చేసి చూపించి, పలువురితో శభాష్ అనిపించుకున్నారు. అంతేకాకుండా తన సర్కస్ కంపెనీ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చి అంతర్జాతీయ స్థాయిలో ఇండియన్ హెర్క్యులస్‌గా పేరుగాంచారు. అటువంటి మహానుభావుడి మనోడే అన్ని చెప్పుకునేందుకు మన్యం ప్రజలు గర్విస్తున్నారు. 1942 జనవరి 14న ఆయన స్వర్గస్తులయ్యారు. ఈ నేపథ్యంలో రామ్మూర్తినాయుడు జీవిత చరిత్రపై సాక్షి అందిస్తున్న సమగ్ర కథనం....

బహుముఖ ప్రజ్ఞాశీలి....

రామ్మూర్తినాయుడు వ్యాయామ విద్యను బోధిస్తూనే వాయు స్తంభన, జల స్తంభన విద్యను ప్రదర్శించేవారు. ఇలా వ్యాయామం, దేహదారుఢ్యం, యోగా విద్యలపై పట్టు సంపాదించారు. ఇన్ని విద్యలు తెలిసిన రామ్మూర్తి ఇలానే ఉంటే ఆయన చరిత్ర ఇన్ని మలుపులు తిరిగి ఉండేది కాదు. ఆయన తర్వాత కాలంలో విజయనగరంలో ఒక సర్కస్ కంపెనీ స్థాపించారు. ఆ కంపెనీ కోడి రామ్మూర్తినాయుడు పేరును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది.

బడికి డుమ్మా..

అప్పటి శ్రీకాకుళం జిల్లా, ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో పుట్టిన రామ్మూర్తినాయుడు చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. తల్లిలేని పిల్లాడు కావడంతో రామ్మూర్తిని తండ్రి వెంకన్ననాయుడు ఎంతో గారాబంగా చూసేవారు. ఈ గారాబంతో రామ్మూర్తినాయుడు బాల్యంలో బడికి వెళ్లకుండా డుమ్మా కొడుతూ.. వీరఘట్టంనకు సమీపంలో ఉన్న రాజా చెరువు వద్దకు వెళ్లి వ్యాయం చేస్తుండేవాడు. దీంతో తండ్రి వెంకన్న తప్పనిసరి పరిస్థితుల్లో కొడుకుని చదువు కోసం విజయనగరంలో ఉన్న తన తమ్ముడు నారాయణస్వామి ఇంటికి పంపించారు. విజయనగరంలో కూడా రామ్మూర్తికి చదువు అబ్బలేదు. విద్య కంటే వ్యాయామంపైనే ఎక్కువ ఆసక్తి చూపుతూ పలు మల్లయుద్ధ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచాడు. ఇక రామ్మూర్తికి చదువు వంటపట్టదని గ్రహించిన పిన తండ్రి అతడిని మద్రాసు పంపించి వ్యాయామ కళాశాలల్లో చేర్పించారు. తర్వాత వ్యాయామ ఉపాధ్యాయునిగా నాయుడు విజయనగరంలో తను చదివిన కళాశాల్లోనే పీడీగా బాధ్యతలు చేపట్టారు.

యుక్త వయస్సులోనే....

రామ్మూర్తి తన 20 ఏళ్ల యుక్త వయసులోనే గుండెల మీద ఒకటిన్నర టన్ను బరువును మోసి చూపించేవారు. సర్కస్‌లో విచిత్రమైన, ఊహకందని విన్యాసాలు చేసేవారు. ఆయనను ఉక్కు గొలుసులతో బంధించేవారు. ఊపిరితిత్తుల నిండా గాలి పూరించి, ఆ గొలుసులను తెంచేవారు. రెండు కార్లకు గొలుసులు కట్టి, వాటిని తన భుజాలకు తగిలించుకుని కదలకుండా ఆపేవారు. ఏనుగును ఛాతి మీద ఎక్కించి దాదాపు ఐదు నిమిషాలు ఉండేవారు. అందుకే ఆయన సర్కస్‌కు విశేషమైన ఆదరణ ఉండేది. ఆసియాలోని జపాన్, చైనా, బర్మా దేశాల్లో కూడా రామ్మూర్తినాయుడు ప్రదర్శనలు ఇచ్చి భారతదేశ కీర్తిని చాటిచెప్పారు. బర్మాలో ఆయనపై హత్యాయత్నం జరగడంతో విదేశీ ప్రదర్శనలను నిలిపివేసి స్వదేశంలోనే స్థిరపడ్డారు.


రామ్మూర్తినాయుడి వంశీకుల చిత్రపటాలు


వీరఘట్టంలో రామ్మూర్తినాయుడు జన్మించిన గృహం ఇదే

బ్రహ్మచారి....

కండల వీరుడు కోడి రామ్మూర్తినాయుడు నిత్య బ్రహ్మచారి. శాఖాహారి అయిన ఈయన ఆంజనేయస్వామి భక్తుడు. చిన్నతనంలో వీరఘట్టం సమీపంలోని రాజా చెరువు వద్ద వ్యాయామం చేస్తున్న సమయంలో ఓ సాధువు ఆయనను పిలిచి మంత్రోపదేశం చేశాడని సమాచారం. అప్పటి నుంచి రామ్మూర్తికి దైవచింతన కలిగింది.

కోడి బయోపిక్....

కోడి రామ్మూర్తినాయుడి జీవిత చరిత్ర ఆధారంగా బయోపిక్ తీసేందుకు కొద్ది రోజుల కిందట కొంతమంది సినిమావాళ్లు వీరఘట్టం గ్రామానికి వచ్చి ఇక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. వారం రోజులు వీరఘట్టంలో ఉండి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సినీ హీరో దుగ్గుబాటి రానా కోడి రామ్మూర్తిగా నటించనున్నారని అప్పటిలో పత్రికల్లో వార్తలు కూడా వచ్చాయి. తర్వాత ఈ విషయంపై ఎటువంటి ప్రస్తావన రాలేదు.

మహారాణి పైడితల్లి

- అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు
- చిలకలతో ప్రత్యేక అలంకరణ


మహారాణి అలంకరణలో వనంగుడిలో కొలువైన పైడితల్లి అమ్మవారు


ఆలయంలో పూల అలంకరణ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



చదురుగుడి ఆలయం ముందు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వినాయక, వేంకటేశ్వరస్వామి విగ్రహాలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారు వనంగుడిలో భోగి సందర్భంగా మహారాణి అలంకరణలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. అర్చకుడు నేతేటి ప్రశాంత్ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చదురుగుడి, వనంగుడి ఆవరణల్లో వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, దూసి శివప్రసాద్ భక్తిశ్రద్ధలతో మహాచండీ యాగం నిర్వహించారు. చదురుగుడిని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించడంతో పాటు పైడితల్లికి చిలకలు నివేదించారు. అలాగే సిటీ బస్టాండ్ వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కొలువైన భవానీ శంకరస్వామికి అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో అన్నాభిషేకం చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పంచదార చిలకల నైవేద్యంతో పైడితల్లి


విద్యుత్ అలంకరణలో చదురుగుడి


చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు


భవానీశంకరునికి అన్నాభిషేకం

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గంట్యాడ:

అగ్ని ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని రామవరం గ్రామానికి చెందిన పూడి గౌరమ్మ(81) ఈనెల 6వ తేదీన ప్రమాదవశాత్తు కుంపటిలో కూర్చొవడంతో గాయపడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం కన్నుమూసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

ఆ గ్రామాల్లో రెండు రోజుల సంక్రాంతి..


పినతాడివాడ గ్రామం

డెంకాడ: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండగను రెండు రోజులు నిర్వహిస్తారు. వాస్తవానికి భోగి, సంక్రాంతి, కనుమ పండగలను వరుసగా సోమ, మంగళ, బుధవారాల్లో నిర్వహించాల్సి ఉంది. అయితే ఆయా గ్రామాల్లో మంగళవారం పెద్ద పండుగ పేరుతో కొంతమంది సంక్రాంతి జరుపుకోగా.. మరుచటి రోజు మరికొంతమంది చిన పండుగ పేరుతో సంక్రాంతి జరుపుకోవడం విశేషం. పూర్వం నుంచి ఇదే ఆచారం కొనసాగుతోందని.. చిన పండుగ తర్వాత కనుమ, ముక్కనుమ జరుపుకుంటామని ఆయా గ్రామాల పెద్దలు చెబుతున్నారు. మండలంలోని పినతాడివాడ, పెదతాడివాడ, గుణుపూరుపేట, గుణుపూరు, డెంకాడ, సింగవరం, నాతవలస, డి.కొల్లాం, చొల్లంగిపేట, గొడిపాలెం, వెదుళ్లవలస, తదితర గ్రామాల్లో రెండు రోజుల సంక్రాంతి ఆచారం ఉంది.

మద్యం బాటిళ్ల పట్టివేత

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తకోట జంక్షన్ వద్ద 503 మద్యం బాటిళ్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారంతో తనిఖీలు చేపట్టగా.. వ్యాన్‌లో తరలిస్తున్న మద్యం సీసాలు పట్టుబడ్డాయన్నారు. వ్యాన్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

యువత క్రీడల్లో రాణించాలి

● జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కొండవెలగాడలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీలో స్థానిక రెడ్డిక వీధికి చెందిన క్రికెట్ జట్టు విజయాన్ని సాధించింది. 110 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెడ్డికి వీధి జట్టు కేవలం ఎనిమిది ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి టోర్నీలో విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడల్లో ఇప్పటికే కొండవెలగాడకు సముచిత స్థానం ఉందన్నారు. క్రీడల్లో రాణిస్తూ యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

● కరెన్సీ సాయి...



జయనగరం జిల్లా కేంద్రంలోని రింగు రోడ్డు సింహాద్రినగర్‌లో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా విగ్రహంతో పాటు వినాయకుడు, దత్తాత్రేయ విగ్రహాలను కరెన్సీ నోట్లతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కరణం జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

విజేతలకు బహుమతుల పంపిణీ


రంగోలీ పోటీల విజేతలతో వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం టౌన్: వాజీ చానల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రంగోలి పోటీల విజేతలకు సోమవారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో బహుమతులు అందజేశారు. ప్రథమ విజేత ఎ. లతకు (హైదరాబాద్) ఎలక్ట్రికల్ స్కూటీ బహూకరించారు. బి. శాంతి (గుంటూరు), ఎం.సువర్ణ (విజయవాడ)ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలందరికీ వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, సురేష్‌బాబు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్వి బహుమతులు అందజేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹250

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
■ గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్, ఇన్నర్ రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజ,మంగళగిరి,తాడికొండ,రాజధానిలోని ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్ర॥ 9948779955 [G-9877]

PLOT FOR SALE
■ విశాఖపట్నం South Coast రైల్వే జోన్ పరిధిలో VMRDA / RERA ఇంటిస్థలం అమ్మకం. బ్యాంక్‌లోన్ సదుపాయం. ఫోన్ : 94932 44471, 93969 72239 [V- 2082]

FLAT FOR SALE
■ 27Lakhs Madhurama Enclave Ready to Occupation, Car parking, Lift. Padmavathi Nagar, 6th Lane, Vizianagaram. Ph : 9246624248 [V- SCA25001129]

ASTROLOGY
■ ICAS ఇండియన కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్సెస్ వారిచే జ్యోతిష్యంలో డిప్లమో కోర్సులు నేర్పించబడును. అడ్మిషన్లు ప్రారంభము. Ct. : సెంట్రల్ స్కూల్, బాలాజీ నగర్, VZM. ఫోన్ : 99666 66659, 93947 89246 [V- 7766]

CHANGE OF NAME
■ I, AJEYA R L S/o LAKSHMANNA R/o 4-175-1 Seegalapalli Lakshmipuram Kuppam Mandal Seegalapalle Chittoor Andhra Pradesh-517425, changed my name to RAM LAKSHMAN AJAY. [I-1242826]

WANTED
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.8317512135 [HA-99519]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.